క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలోని వల్లె కుంట గ్రామానికి చెందిన కటకం వర్షిత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆర్థిక సాయం కోసం కుటుంబ సభ్యులు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.1.30 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆస్పత్రి సహాయకుడు సచిన్ ద్వారా సోమవారం ఎల్‌ఓసీ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

స్పాట్ అడ్మిషన్

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్‌లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పాలిసెట్ 2025 పరీక్షలో ఉత్తీర్ణత పొంది క్వాలిఫై కానివారితో పాటు పాలిసెట్ పరీక్ష రాయని విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పదో తరగతి పాసైన వారు మాత్రమే అర్హులని ఈ నెల 10లోగా ధ్రువీకరణ పత్రాలు జత చేసి కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణ చందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ నుంచి 10 తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు.

సద్వినియోగం చేసుకోవాలి

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రవేశపెట్టిన ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు కారణాలతో చదువు మధ్యలో మానేసిన వారు ఉన్నత విద్యను అభ్యసించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ స్కూల్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్‌కు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 18 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరామర్శ



గణపురం: మండలంలోని గాంధీనగర్‌కు చెందిన కీర్ల శ్రీకాంత్ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం పరామర్శించారు. అలాగే అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పల్లెబోయిన భద్రయ్యను పరామర్శించి ధైర్యం కల్పించారు. నాయకులు కాల్వ రాంరెడ్డి, ముత్యాల రాజయ్య, బొచ్చు స్వామి పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ పనిముట్లు

మల్హర్: వ్యవసాయ యాంత్రీకరణ పథకం (సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్)లో భాగంగా 2025–26 సంవత్సరానికి గాను మండలానికి 50 శాతం రాయితీతో మహిళా రైతులకు 131 పనిముట్లు కేటాయించినట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోటవేటర్స్–5, కల్టివేటర్, కేజీ వీల్స్, డిస్క్ హారో 7, బ్యాటరీ స్ప్రేయర్స్ 90, పవర్ ఆపరేటర్స్ స్ప్రేయర్స్ 22, బ్రష్ కట్టర్ 2, వరి గేట్లు వేసే యంత్రం 1, విత్తనం 1, ఎరువులు వేసే యంత్రం 1, పవర్ టిల్లర్, వరి గడ్డి కట్టే యంత్రాలు 2 అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ భూమి కలిగిన మహిళా రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్ జిరాక్స్, ట్రాక్టర్ ఆర్సీ, పాస్ ఫొటోతో దరఖాస్తును సంబంధిత తాడిచర్ల, కొయ్యూరు వ్యవసాయ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.


విద్యుదాఘాతంతో ఆవు మృతి



మొగుళ్లపల్లి: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని మొట్లపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన తోకల లక్ష్మయ్యకు చెందిన ఆవు పల్లె ప్రకృతి వనం వద్ద మేస్తుండగా ప్రమాదవశాత్తు తగలి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు లక్ష్మయ్య వేడుకుంటున్నాడు.

అందని వేతనాలు

- మోడల్ స్కూల్‌లోని పలువురు ఉద్యోగులకు అందని జీతాలు
- పట్టించుకోని అధికారులు



మల్హర్ మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్

మల్హర్: ఆరు నెలలుగా వేతనాలు అందక మోడల్ స్కూల్‌ని ఔట్‌సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని జీతాలు అవి కూడా సమయానికి రాకపోవడంతో కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్నారు. ఆ అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం ఆరు మోడల్ స్కూళ్లు ఉండగా 24 మంది ఔట్‌సోర్సింగ్ , 50 మంది గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు ఉన్నారు. ఒక్కొక్కరికీ సుమారు నెలకు రూ.15వేల పైచిలుకు వేతనం చెల్లిస్తోంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా, గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులకు మూడు నెలులుగా జీతాలు రావడం లేదు. ఈ వేతనం సమయానికి అందక ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. తమ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నా అధికారులు పెండింగ్ వేతనాలు చెల్లించి తమ సమస్య పరిష్కరించాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఈ మేరకు ఆదివారం మల్హర్ మండలంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచందర్ రావుకు ఆ స్కూల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు.

అప్పులు చేస్తున్నాం..



ఆరు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణ, ఇతర ఖర్చులకు అప్పులు చేస్తున్నాం. ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

– రాజబాబు, ఫిజికల్ డైరెక్టర్, మోడల్ స్కూల్, మల్హర్

జీతాలు ఇవ్వాలి

మాకు ఆరు నెలలుగా జీతాలు రావడం లేదు. ఎప్పుడు అడిగిన వస్తుంది.. ఇస్తాం అంటాన్నారు కానీ ఇవ్వడం లేదు. ఒక నెల రాకుంటే ఎలాగో గడుపుతాం. కానీ ఆరు నెలలుగా జీతాలు రాకుంటే కుటుంబం ఎలా పోషించుకోవాలి. అధికారులు వెంటనే జీతాలు ఇవ్వాలి.

– చంద్రయ్య, ఔట్‌సోర్సింగ్ అటెండర్, మోడల్ స్కూల్, మల్హర్

ఆలయాల్లో శ్రావణ శోభ



కోటగుళ్లలోని గణపేశ్వరుడు



రెడ్డిగుడిలోని నాగలింగేశ్వరుడు



పట్టాభి రామచంద్రస్వామి ఆలయంలో రాముడు

గణపురం: మండలంలోని ఆలయాల్లో శ్రావణ మాస శోభ సంతరించుకుంది. ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయాలు కావడంతో సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. మండల కేంద్రంలో కాకతీయుల పాలనలో పలు ఆలయాలను నిర్మించారు. కళా క్షేత్రం కోటగుళ్లు, రెడ్డిగుడి, పట్టాభి సీత రామచంద్ర స్వామి ఆలయం, గణపసముద్రం చెరువు కట్టపై దక్షణముఖ ఆంజనేయ స్వామి ఆలయలు నిర్మించారు. ఈ ఆలయాల్లో శ్రావణ మాసం సందర్భంగా భక్తులు ప్రతి రోజు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేస్తున్నారు. కోటగుళ్లలోని గణపేశ్వరస్వామి, రెడ్డిగుడిలోని నాగలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రతీ రోజు నిత్య అభిషేకాలు చేస్తుండడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఎంతో మహిమానిత్వమైన ప్రసిద్ధిగాంచిన ఆలయాలు కావడంతో భక్తులు ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి తరలివచ్చి శ్రావణ మాసం సందర్భంగా ప్రతేక పూజల్లో పాల్గొంటున్నారు.

సమావేశ మందిరం ప్రారంభం



ప్రారంభిస్తున్న సీఈ ప్రకాశ్

గణపురం: మండలంలోని చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలోని ప్రాజెక్టు సర్వీస్ బిల్డింగ్‌లో 3వ అంతస్తులో నిర్మించిన సమావేశ మందిరాన్ని కేటీపీపీ సీఈ చిట్టాప్రగడ శ్రీ ప్రకాశ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీపీపీలో పని చేసే ఇంజనీర్లు, ఉద్యోగులతో సమావేశాలు ఏర్పాటు చేసేందుకు ఈ మంది రం ఉపయోగపడుతుందన్నారు. ఆయన వెంట పలువురు ఇంజనీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్లు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



నిరసన వ్యక్తంచేస్తున్న మహిళలు

మల్హర్: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీకాలనీ, పుట్టపాక వాడలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ.. మహిళలు ఖాళీబిందెలతో సోమవారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పల్లెల్లోని రెండు బోరు మోటర్లు చెడిపోయి మూడు నెలలు గడుస్తున్నా అధికారులు మరమ్మతులు చేయడం లేదన్నారు. దాదాపు 200 కుటుంబాలు నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు. నీటి కోసం సమీపంలోని ఇంటి బోర్లు, వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నామని చెబుతున్నారు. పాత వాటర్ ట్యాంకులోకి మిషన్ భగీరథ వాటర్ రావడంతో మిషన్ భగీరథ నీరు తాగడానికి గ్రామస్తులు మొగ్గుచూపడం లేదు. జిల్లా అధికారులు స్పందించి కొత్త మోటర్లను ఏర్పాటు చేసి నీటి కొరత తీర్చాలని పల్లెవాసులు కోరుతున్నారు. దీనిపై కార్యదర్శి వెన్నలను వివరణ కోరగా ఇప్పటికి మూడుసార్లు రెండు బోర్లను మరమ్మతులు చేశామని అయినా పనిచేయడం లేదన్నారు. కొత్త బోర్ల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదించామని.. నిధులు కేటాయించగానే కొత్త బోరు మోటర్లను ఏర్పాటు చేస్తామన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



రేగొండలో బాలామృతం, గుడ్లు ఇస్తున్న సిబ్బంది



కాటారం: అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ రాధిక

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ సిబ్బంది అన్నారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది మాట్లాడుతూ.. పిల్లలు పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని దీంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు.

– సాక్షి నెట్‌వర్క్



భూపాలపల్లి రూరల్: తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



టేకుమట్ల: అక్షరాభ్యాసం చేయిస్తున్న సిబ్బంది



చిట్యాల: తల్లిపాల వారోత్సవాల్లో సిబ్బంది

నిబంధనల మేరకే షెడ్డు తొలగించాం..

- కమిషనర్ శ్రీనివాస్

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వ నిబంధనలను అనుసరించి పాఠశాల దారికి అడ్డంగా ఉన్న గేదెల షెడ్డును తొలగించామని మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పట్టణంలోని మంజూరునగర్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్నటువంటి రోడ్డుకు సంబంధించిన స్థలంలో కూరాకుల ఓదెలు రేకుల షెడ్డును, గడ్డివాము వేసి గేదెలను కట్టేసినట్లు తెలిపారు. పాఠశాల పక్కన గల షెడ్డులో గేదెలు ఉండడంతో పిల్లల రాకపోకలకు, ప్రాణభయంగా ఉందని షెడ్డును తొలగించాలని ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు మున్సిపల్ కార్యాలయంలో గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై వెళ్లి పరిశీలించగా ఇక్కడ 30 ఫీట్ల వెడల్పు రోడ్డు ఉన్నట్లు తేలిందన్నారు. ఈ రోడ్డుకు గత పాలకమండలి హయాంలో రూ.4.80 లక్షల నిధులతో సీసీ రోడ్డును మంజూరు చేసినట్లు తెలిపారు. కాగా, పాఠశాల ఈ విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు గేదెలతో భయభ్రాంతుకు గురవుతున్నారని ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు మళ్లీ ఫిర్యాదు చేశారన్నారు. దీంతో షెడ్డు, గడ్డివామును తొలగించాలని కోరుతూ ఓదెలుకు ఏడు రోజుల గడువుతో జూలై 17న నోటీస్ జారీ చేశామన్నారు. నోటీసుకు ఓదెలు గడువు లోపల ఎటువంటి సమాధానం ఇవ్వక పోవడంతో పురపాలక సంఘ చట్ట ప్రకారం షెడ్డును జూలై 07న తొలగించమన్నారు.

ఎవరి నుంచి ఎటువంటి ఒత్తిళ్లు లేవు

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మంజూరు నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం అక్రమ నిర్మాణాలను తొలగించడానికి పోలీసు బందోబస్తు కావాలని కోరగా సిబ్బందిని పంపించినట్లు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు ఎవరి నుంచి ఎటువంటి ఒత్తిళ్లు లేవన్నారు. కేవలం విధి నిర్వహణలో భాగంగా మున్సిపల్ కమిషనర్ అభ్యర్థన మేరకు మాత్రమే పోలీసు సిబ్బందిని పంపించినట్లు తెలిపారు. ఈ విషయంలో అక్కడ సీసీ రోడ్డు వేసే ప్రదేశం ప్రైవేట్ స్థలమా లేక పబ్లిక్ స్థలమా అనే విషయాన్ని మున్సిపాలిటీ అధికారులే నిర్ణయిస్తారని తెలిపారు.

డేంజర్ జోన్ ఇళ్లు సేకరించాలి

మల్హర్: తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌కు 500 మీటర్ల పరిధిలో ఉన్న మండలంలోని పెద్దతాడిచర్ల డేంజర్ జోన్ ఇళ్ల వివరాలను సేకరించాలని గ్రామానికి చెందిన నిర్వాసితులు తాండ్ర మల్లేశ్, కేసారపు నరేష్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. డేంజర్ జోన్ ఇళ్లకు సంబంధించిన విధివిధానాలను ప్రకటించాలన్నారు. లోకల్, నాన్‌లోకల్ గుర్తించి మొదటి నుంచి నివసిస్తున్న తాడిచర్ల గ్రామానికి చెందిన వారికి ఇళ్ల నష్ట పరిహారంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించి సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. ఈనెల 31లోగా డేంజర్ జోన్ సేకరణపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో సెప్టెంబర్ మొదటి వారంలో మండల తహసీల్దార్ ఆఫీసు ముందు రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు.

కోల్డ్ చైన్ నిర్వహణ అత్యంత కీలకం

- కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్
- పశువైద్యశాల ఆకస్మిక తనిఖీ



పశువైద్యాధికారితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్

కాళేశ్వరం: బయోలాజికల్ ఉత్పత్తుల ప్రభావాన్ని కాపాడేందుకు కోల్డ్‌చైన్ నిర్వహణ అత్యంత కీలకమైనదని కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్ అన్నారు. సోమవారం మహదేవపూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ పశువైద్యశాలను సబ్‌కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న వివిధ కార్యక్రమాలపై పశువైద్యాధికారి డాక్టర్ రాజబాపుతో కలిసి సమీక్ష నిర్వహించారు. బ్లూటంగ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సమీక్షించడమే గాక, వ్యాక్సిన్‌లు, ఔషధ నిల్వలపై కోల్డ్ చైన్ నిర్వహణపై కూడా తనిఖీ చేశారు. కృత్రిమ గర్భధారణ కార్యక్రమాల వివరాలు, రోజువారీ చికిత్స పొందే పశువుల సంఖ్య, సిబ్బంది వివరాలు, ఆస్పత్రి పనితీరు వంటి అంశాలను పరిశీలించారు. ఆస్పత్రిలో అవసరమైన మౌలిక వసతుల లోపాలపై రాతపూర్వక నివేదికను సమర్పించాల్సిందిగా వెటర్నరీ డాక్టర్‌ను ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది పశువుల వ్యాధులపట్ల సకాలంలో స్పందించాలని.. తగిన చికిత్స అందించాలని.. సమయపాలన పాటించాలని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. వెటర్నరీ సేవలను మరింత బలోపేతం చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన పశువుల ఆరోగ్య సంరక్షణపై పశుసంవర్ధక శాఖ యంత్రాంగానికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజబాబుగౌడ్, సిబ్బంది హరినాయక్, నాగభూషణం, లక్ష్మణ్, లావణ్య, ముదాసిర్ పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



పంపిణీ చేసిన హెల్మెట్లతో ఫొటో గ్రాఫర్లు, తదితరులు

- ఎస్సై శ్రీనివాస్

భూపాలపల్లి రూరల్: ప్రతీ వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. భూపాలపల్లి మండల ఫొటోగ్రాఫర్ సంఘం అధ్యక్షుడు కారుకూరి సతీశ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని జయశంకర్ సార్ విగ్రహం వద్ద ఫొటోగ్రాఫర్లకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను ఫొటో గ్రాఫర్లకు వివరించారు. అనంతరం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్ల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, కోశాధికారి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు రఫీ, గోపరాజు, రంగు రవి, దిండి సత్యం, కోరే సదానందం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

గణపురం: శ్రావణమాస రెండో సోమవారం సందర్భంగా మండలంలోని శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆల య ప్రధాన అర్చకులు శేషాచార్యులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆయ న వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

7న సామాజిక తనిఖీ ప్రజావేదిక

కాటారం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 7న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాబు, ఏపీఓ వెంకన్న సోమవారం తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో 1 ఎప్రిల్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు నిర్వహించిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందాలు వారం రోజులుగా తనిఖీ చేపట్టి నివేదికలు రూపొందించినట్లు తెలిపారు. నివేదికలను ప్రజావేదిక ద్వారా వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

- సివిల్ ఆస్పత్రి ఎదుట నాయకుల నిరసన

చిట్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల్లో చదువుకునే విద్యార్థులను పట్టించుకోకపోవడంతోనే ఫుడ్ పాయిజన్ అవుతుందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. మొగుళ్లపల్లి మండలంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలో 16 మంది విద్యార్థినులకు ఫుడ్‌పాయిజన్ కావడంతో స్థానిక సివిల్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట సోమవారం ధర్నా చేసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫుడ్ పాయిజన్‌కు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ధర్నా చేస్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు.

విద్యార్థులకు పురస్కారాల అందజేత



మోమెంటో అందజేస్తున్న ఎంఈఓ ప్రకాశ్‌బాబు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో 2024–25లో 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెమోంటో, డిక్షనరీ సోమవారం అందజేశారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు చొప్పున మండలంలోని 19 మంది విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ అవార్డులను మండల విద్యాధికారి ప్రకాశ్‌బాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ



టై, బెల్టు అందజేస్తున్న రామ్మూర్తిశర్మ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పెంటి శ్యాం ఆధ్వర్యంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రామగుండం రామ్మూర్తిశర్మ విద్యార్థులకు 10వేల విలువైన టై, బెల్ట్‌లు, నోట్‌బుక్స్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రామ్మూర్తిశర్మ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత ఆశయాలను కలిగి ఉండి ఊరికి చదివిన పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. క్రీడ పాఠశాలకు ఎంపికైన శాన్విని అభినందించారు.

'చర్య తీసుకోవాలి'

మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సక్రమంగా విధులు నిర్వర్తించని ఇంగ్లి ష్ టీచర్‌పై చర్యలు తీసుకోవా లని విద్యార్థుల త ల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం వా రు మాట్లాడుతూ.. హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు 35 మంది పిల్లలు చదువుతున్నారని 9 మంది సిబ్బంది ఉండగా 8 మంది టీచర్లు పని చేస్తున్నారన్నారు. ఇంగ్లిష్ టీచర్ లాంగ్ లీవ్ పెట్టడంతో ఇంగ్లీష్ సబ్జెక్టు చదువుకు వి ద్యార్థులు దూరమవుతున్నామని చెబుతున్నారు. పాఠశాలలో ఖాళీ చూపక పోవడంతో టీచర్ పోస్టును అధికారులు భర్తీ చేయడం లేదని తెలుపుతున్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన గడదాసి శ్రీనివాస్‌కు చెందిన మారుతి ఫ్యాషన్ బట్టల షాప్ ప్రమాదవశాత్తు ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. దీంతో వర్తక వ్యాపార సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు సదానందం, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో సోమవారం రూ.1,50000లను ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు పాలాల సరోత్తంరెడ్డి, ఆది రఘు, నిమ్మల స్వామి, రేణుకుంట్ల శ్రీధర్, చిరంజీవి, పైడి, మహేందర్, ఎంబాడి రాజేందర్, రాజు, తదితరులు ఉన్నారు.